# మళ్ళీ ఉత్తరమా!

భమిడి వెంకటేశ్వర్లు

రాజేశ్వరి చెప్పినా వినకుండా వూరువెళ్ళిపోయింది. "బస్సులో జాగ్రత్త–నిద్రపోకు" అని మాత్రం అన్నాడు శేషగిరి, "ఎన్నాళ్ళుండి రమ్మంటారు" అన్న భార్య ప్రశ్నకు సమాధానంగా.

"ఊరగాయలు జాగ్రత్తగా గరిటెతో తీసి మూతలు పెట్టండి" తను మరీ మరీ చెప్పింది. ఆ మాటకు స్వగతంలోనే నవ్వుకున్నాడు. అందుకే అన్నాడు "నేను ఏదైనా ఎంత జాగ్రత్తగా వాడుకుంటానో నీకు తెలిసే వుంటుంది. ఇది నాకు చెప్పాలా" భార్యమీద కోపం.

ఇంటికొచ్చేసరికి పదిగంటలయింది. తెల్లవారి లేచేసరికి ఏడుగంటలయింది. ఇష్టం లేకపోయినా, బద్ధకంగానే ఆఫీసుకు బయలుదేరాడు శేషగిరి. ఎల్లాగో అయిదుగంటలవాకా కాలక్షేపం చేసి యింటికి బయలుదేరాడు. తాళం తీసి లోపలకు అడుగుపెడుతుంటే కాళ్ళ దగ్గర కవరు కనిపించింది. తీసి చూసాడు. దస్తూరినిబట్టి, రాజేశ్వరి తల్లి రాసిందని గ్రహించాడు. "మళ్ళీ ఉత్తరమా? నాలుగు రోజుల క్రితమేగా వచ్చింది...అందులో ఇప్పుడు ఇన్‌లాండు కవరు..." శేషగిరికి ఆశ్చర్యం వేసింది.

రాజేశ్వరి ఎప్పుడొస్తుందో తెలియదు కాబట్టి, ఉత్తరం చదవాలనుకున్నాడు. కాని అలవాటు గుర్తుకొచ్చింది. భార్య పేరన వచ్చిన ఉత్తరం... ఎటూ తను చదివేక యిస్తుంది....అందులో పెద్దగా విశేషాలుండవు....ఏదో రామాయణం ...అదీకాక శేషగిరిలో సెంటిమెంటు వుంది—ఆ మాటకొస్తే పోస్టు చేయమని ఉత్తరం యిస్తే - అది కార్డు అయినా సరే చదవడు. కేవలం చిరునామా సరిగా రాసిందో లేదో అని మాత్రం చూస్తాడు.

కవరు అలాగే టీ.పీ. మీదవుంచి ఎగిరిపోకుండా ఏదో పుస్తకం పెట్టాడు. ఆలోచనలు మాత్రం ఉత్తరం గురించే....

మంచంమీద కూర్చున్నాడు శేషగిరి. రెండో తలగడవైపు చూస్తూ కసిగా నలిపేసాడు. తటుక్కున రాజేశ్వరి రూపం తలగడమీద మెరిసింది.

నాలుగురోజుల క్రితం వచ్చిన ఉత్తరంలో కేవలం క్షేమసమాచారాలే వున్నాయి....ఇప్పుడు కవరులో రాసేటంతటి గొప్ప విశేషాలేముంటాయి?

"ఇంతకీ ప్రయాణం సంగతి ఏం చేసారు...వెళ్ళమంటారా?" రాజేశ్వరి అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"నీకు ఆ ధ్యాస తప్ప మరేమీ ఉండదేమో" కోపంగా అన్నాడు తను.

"అవును మరి, మీకు మీ ధ్యాస, నాకు ప్రయాణం ధ్యాస....ఇంక అడగనులెండి ...ఏదో ఒకటి చెప్పేయండి....మా అక్క మళ్ళీ ఫోను చేసింది... తాను సెలవు గురించి ప్రయత్నిస్తోందిట....రిజర్వేషను చేసుకోవాలి కదా... అసలే సెలవులు ...టిక్కెట్లు దొరకవు....మీ పని అయ్యేకే జవాబు చెప్పండి...." గోముగా అంది రాజేశ్వరి.

శేషగిరి జవాబు చెప్పకుండా బయటకు వెళ్ళేందుకు, పాంటు, షర్టు వేసుకోసాగాడు. "అప్పుడే పెళ్ళి మూడేళ్ళు అయింది. ఇన్నేళ్ళు పుట్టింటికి వెళ్ళకుండా ఏ ఆడదీ ఉండదు. ఇంతకీ మా అక్క వెడుతోంది కాబట్టి నేనూ వెడదామనుకుంటున్నాను. అంతేగా...." తనే అంది.

"మీ అక్క వెళ్ళకపోతే నీకు వెళ్ళే ఉద్దేశ్యం లేదని నన్ను నమ్మమంటావ్..." శేషగిరి గొంతులో వెటకారం ధ్వనించింది.

అతను వెళ్ళిపోయాడు.

"ఏం మనిషో....ఎప్పుడూ డబ్బు గురించే ఆలోచన..." స్వగతంలో విసుక్కుంటూ అనుకుంది రాజేశ్వరి.

పిల్లల పరీక్షలు వారం క్రితం అయినప్పట్నుంచీ, రాజేశ్వరి దృష్టి పుట్టింటికి మళ్ళింది. ప్రయాణం గురించి మాట్లాడేందుకు, చివరి పరీక్షనాడు వాళ్ళక్క దగ్గరకెళ్ళింది.

"నేను పదిహేనురోజులు సెలవు పెట్టాను. ఖర్చులకు ప్రావిడెంటుఫండు అడ్వాన్సు పెట్టాను. రెండురోజుల్లో రావచ్చు. పోతే మా అబ్బాయి రానంటున్నాడు. ఇంక మా అమ్మాయి వాళ్ళ నాన్నని వదిలి వుండలేదు కనుక అదీరాదు. నేనొక్కదాన్నే ప్రయాణం." వాళ్ళక్క అంది.

"మా పిల్లలిద్దరూ కూడా రామంటున్నారు. కాని నేనే రమ్మంటున్నాను. సరే అన్నారు. ఇంతకీ ప్రయాణం ఎప్పుడు?" రాజేశ్వరి అడిగింది.

"రేపు వచ్చే సెకండ్ సాటర్‌డే. ఆదివారం ఆఫీసుకు సెలవులు. సోమవారంనుంచి సెలవు మొదలవుతుంది. కాబట్టి శుక్రవారం రాత్రి బయలుదేరితే శనివారం పొద్దున్నే మన వూరు చేరవచ్చు. పైగా రెండురోజులు సెలవు కలిసొస్తుంది." సలహాని సగర్వంగా వివరించిందామె.

ఆ విషయమే శేషగిరితో చెప్పింది రాజేశ్వరి.

"నీకు వయసుంది. అంతో యింతో అర్థం చేసుకొనేందుకు మెదడుంది. నేను ఆపరేషను చేయించుకోకపోతే యింకా పిల్లల్ని కనేందుకు ఓపిక, అవకాశం వుంది. కొండంత ఖర్చు ఎదురుగా కనిపిస్తోంది. ఇప్పుడు యీ ప్రయాణానికి ఎంతలేదన్నా అయిదొందలు అవుతుంది. అనవసరంగా దారి ఖర్చులు దండగ దేనికి! ఎవరు తిన్నట్టు!" అంటూ నచ్చచెప్పాడు శేషగిరి.

ఆమె వినిపించుకోలేదు. "నేనేమైనా వెడతాను." అంది.

"మరి అటువంటప్పుడు నన్నెందుకు అడగటం! నన్ను వెధవని చేసి, నాచేత వాగించి నీచేత అక్షింతలు వేయించుకునేందుకా?" అతనికి కోపం వచ్చింది.

అప్పటికా ప్రసక్తి ఆగింది. భర్తని వశపరచుకునే నేర్పు, శక్తి ఆడదానికి బాగా తెలుసు. అందుకో ప్రత్యేక సమయం వుంది. అప్పుడు ఏ భర్తా కాదనలేడు. డబ్బు లేకపోయినా, ఎన్ని ఖర్చులున్నా "ఓ.కే. వెళ్ళరా..." అనేస్తాడు.

ఆ రాత్రి...పిల్లలిద్దరూ పడుకున్నాక...రాజేశ్వరి శేషగిరి పక్కన చేరింది. "ఏమండీ....ఏమిటీ...అప్పుడే పడుకున్నారు....కార్యక్రమాలన్నీ అయిపోయాయా...." అంటూ

"ఏం చేయమంటావ్ ...రేపట్నుంచి ఎటూ ఉపవాసమే కదా....ఇవేల్టినుంచీ ప్రాక్టీసు చేస్తున్నాను" అన్నాడు శేషగిరి.

"ఈ మల్లెపూల దండ చూడండి. రోజూ మూర అర్ధరూపాయికి యిచ్చేవాడు. ఇవేళ ముప్పావలా అన్నాడు వెధవ" అంటూ మల్లెదండను అతని ముఖం మీదకు జారవిడిచింది రాజేశ్వరి.

"అవును మరి....రేపట్నుంచి వాడికి ఓ బేరం పోతుందిగా. అందుకే యీ రోజు పావలా ఎక్కువ తీసుకుని వుంటాడు. వాడిదేం తప్పులేదు" సమర్థించాడు శేషగిరి.

"మరి వెళ్ళమంటారా నన్ను" అనునయంగా అడుగుతూ ఆమె అతని చెంపలకు దగ్గరకు జరిగింది.

"నీ యిష్టం నేను చెప్పాల్సింది చెప్పాను. వినటం వినకపోవటం నీకే వది లేశాను. నువ్వొచ్చేవరకూ మడి కట్టుకోగలను. ఒంటరిగా పడుకోవాలన్న బెంగ తప్పిస్తే మరేం లేదు. నీ మంత్లీ పీరియడ్సు పుణ్యమా అంటూ అంతో యింతో వంట చేతయింది. నీకు అమ్మమీద, నాయనమ్మ మీద వున్న ప్రేమ మొగుడిమీద వున్నట్టు కనిపించదు. నీకు లేనప్పుడు నేను మాత్రం ఎందుకు పెంచుకోవాలి. ఇప్పుడు నేనెందుకు వద్దంటున్నానో తిరిగొచ్చాక నీకే తెలుస్తుంది."

"మీరెందుకు వద్దంటున్నారో నాకు తెలుసు." చటుక్కున అంది రాజేశ్వరి.

"నీకు తెలిసింది అంతే. నీకి రోజులు, ఖర్చులు, డబ్బు విలువ గురించి తెలియదు. సమయం, అవసరం గురించి చెప్పినా అర్థం కాదు" కోపంగానే అన్నాడు శేషగిరి.

"ఇంక లైటు తీసేయమంటారా?" అంటూ లేవబోయింది.

"పెరిగే గడ్డం దేనికీ అడ్డం కానట్టే, లైటు కూడా అడ్డం కాదు. పిల్లలు గాఢనిద్రలో వున్నారు."

"మీకు చీకటి కావాలేమో కదా" మత్తుగా, చిలిపిగా అంది రాజేశ్వరి.

"రూపాయి సంపాదించటం కష్టం. ఖర్చు చేయటానికి క్షణం చాలు. మొన్న ఊరగాయలకు మూడు నాలుగొందలు అయింది. రేపు స్కూళ్ళు తెరిచాక ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం అంటూ ఎంతవుతుందో తెలియనిది కాదు. అవసరం లేనప్పుడు రూపాయి ఖర్చు చేసేందుకు ఎంతో ఆలోచించాలి. అనవసరంగా ఖర్చు దేనికి? ఇప్పుడు మీ అక్క ఎందుకు వెడుతోందో, అసలు విషయం నీకు తెలియదు." మల్లెపూల గుబాళింపు అతన్ని ఓ క్షణం వివశుడ్ని చేయటంతో ఆగాడు.

"ఏమిటా అసలు విషయం" ఏదో కొత్త విషయం తెలుసుకోబోతున్నట్టుగా అడిగింది రాజేశ్వరి.

"మీ అక్క ఉద్యోగం చేస్తోంది. మా కేంద్ర ప్రభుత్వోద్యోగులకంటే మీ అక్క పని చేసే రాష్ట్ర ప్రభుత్వోద్యోగులే నయం. ఎప్పుడో పెట్టి పుట్టారు. అడిగిందే చాలు, వాళ్ళ ప్రభుత్వం అన్నీ సమకూర్చిపెడుతుంది, సెలవు అమ్ముకుని ఊరికి బయలుదేరుతోంది. పైగా వాళ్ళకి సొంత వూరు వెళ్లేందుక్కూడా ఎటువంటి మినహాయింపులు లేకుండా దారిఖర్చులు యిస్తుంది. మినహాయింపు కూడా నామమాత్రమే. ఇది నీకు తెలియదు ప్రావిడెంటుఫండు నుంచి అప్పు తీస్కుంటున్నట్లు చెప్పింది. ఇంక మీ వదిన అంటావేమో ఉద్యోగం లేకపోయినా కుట్టుపని, ఎంబ్రాయిడరీ చేస్తుంది. కాని మన విషయం అలా కాదు. అన్నింటికీ నేనే చావాలి." ఇష్టం లేకపోయినా శేషగిరికి చెప్పక తప్పలేదు.

"నేను ఉద్యోగం చేయనన్నానా?"

"సరే...ఇంక భారతం చెప్పకు. మీ అక్క శ్రమ పడుతోందిగా. డబ్బు కోసం నేను నిన్ను బాధపెట్టదలుచుకోలేదు."

భర్త ధోరణి ఆమెకు నచ్చలేదు.

"మా నాయనమ్మ రోజూ కలలోకొస్తోంది. ఓసారెళ్ళి చూసొస్తాను' మా అన్నయ్యలు, వదినలు, పెద్దక్క అంతా వస్తున్నారుట" అంటూ భర్త మీదకు ఒరిగింది రాజేశ్వరి.

"నువ్వు అనవసరంగా బాధపడతావు. అది నాకిష్టం లేదు, పల్లెటూళ్ళలో కరెంటు వుండటం లేదుట. అందులో మీ వూరి విషయం నీకు తెలిసిందే. ఇంక యీ ఎండలకు మీ నూతిలో నీళ్ళు కూడా అయిపోయి వుంటాయి. చెరువు కూడా ఎండిపోయి వుంటుంది. ఇదంతా తెలిసి వెళ్ళటం ఎందుకూ?" శేషగిరి వివరంగా చెప్పాడు.

"బతికుండగా మా నాయనమ్మను చూడాలని వుంది. ఆవిడ పోయేక ఏం చూస్తాను."

"నువ్వు చాలా తెలివితక్కువదానివి. ఆవిడకు పెద్దవయసు. డెంభై ఏళ్ళొచ్చాక ఏవో నలతలు, అనారోగ్యం తప్పవు. ఇప్పుడు ఆవిడకోసం అయిదొందలు ఖర్చు పెట్టటం తెలివితక్కువతనం. నన్నింక విసిగించకు."

రాజేశ్వరి లైటు తీసేసి వచ్చి శేషగిరి పక్కన చేరింది.


ఆ మర్నాడు మళ్ళీ ప్రయాణం మీద చర్చ కొనసాగింది.

"నువ్వు రాలేదని ఎవరూ బాధపడరు. ఇతరులకోసం మనం తాపత్రయ పడేముందు, వాళ్ళు మనకోసం ఏంత ఆలోచిస్తున్నారు అని ఆలోచించాలి. జీవితంలో ఓ స్థాయి చేరుకున్నాక, కొంత వయసు అనుభవం వచ్చాక, బరువు బాధ్యతలు పెరుగుతున్నప్పుడు యిలా అభిమానాలు, ఆప్యాయతలు అంటూ ఖర్చులు పెంచుకోవటంలో అర్థం లేదు. మనసులో వుంటే చాలు. ఎదురుగా వెళ్ళి కావలించుకుని ఏడ్చి నటించటం దేనికి! ఇటువంటి మొసలి కన్నీళ్ళంటే నాకు చిరాకు."

శేషగిరి మాటలను మధ్యలోనే కట్ చేసింది రాజేశ్వరి.

"మీరు డబ్బు మనుషులు...మంచీ, మర్యాద, గౌరవం తెలియదు మీకు. మీ సుఖానికి తక్కువవుతుందని ఏవో కాకమ్మ కబుర్లు చెప్తున్నారు. అసలు మీరు ఏ లాయరో అవ్వవలసింది." కోపంగా అంది తను.





"సరే అయితే నన్నింక యీ విషయంలో విసిగించకు. నీ యిష్టం ఎన్ని రోజులున్నా సరే! నేను రమ్మనమని ఉత్తరం రాయను. మీ నాన్న రిటైరయ్యాడని, కాణీ సంపాదన లేదని, మీరంతా వెళ్ళి ఆయన నెత్తిమీద కూర్చుంటే ఆ ఖర్చు తట్టుకోలేడని, అనవసరంగా శ్రమ, బాధ కోరి తెచ్చుకోవడం దేనికని— అన్నానే తప్ప మరో ఉద్దేశం నాకు లేదు. ఇప్పుడే వెళ్ళి ఆరువందలు అప్పు తెచ్చి సాయంత్రం టిక్కెట్లు కొని తెస్తాను." అంటూ బయటికి వెళ్ళిపోయాడు శేషగిరి - ఆ కాలనీలో అప్పు యిచ్చే ఓ షావుకారు దగ్గరకు.

అసలీ రోజుల్లో ఓ మనిషికి మరో మనిషి బరువు. భరించటం కష్టం. శేషగిరి మావగారిది అదో తత్వం. జనాన్ని చూస్తే ఆయనకు యిట్టే బీ.పి పెరుగుతుంది. నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. ఇప్పుడు అతనికి తన పెళ్ళినాటి సంఘటన గుర్తుకొచ్చింది.

ఆ రోజు.... పెళ్ళినాటి మరునాడు ... పెళ్ళివారంతా అనుకున్న మాటల ప్రకారం వెళ్ళిపోవలసిన రోజు. విడిదిల్లు ఖాళీ చేసేయాలి. భోజనాల సంబంధం లేదు. కాని ఆ రోజు వారి కాంట్రాక్టు బస్సు రిపేరు కావటంతో ప్రయాణం రాత్రికి వాయిదా పడింది. మధ్యవర్తి వెళ్ళి ఆ పూటకు పెళ్ళివారికి కాఫీ, టిఫిను, భోజనం సంగతి చూడమన్నాడు.

"క్షమించండి. అనుకున్న ప్రకారం సక్రమంగా జరిపించాను. ఇంక యీ ఖర్చు భరించలేను. మీరే ఏదైనా దారి చూసుకోండి" అంటూ చేతులు జోడించాడు.

అంతే ఎవరివాంళ వాళ్ళు వెళ్ళవలసి వచ్చింది. మగ పెళ్ళివాళ్ళు ఖచ్చితంగా, మొండిగా, సిగ్గు లేకుండా వ్యవహరిస్తుంటే ఆడ పెళ్ళివాళ్ళు కూడా బిర్ర బిగుసుకుని ప్రవర్తించటంలో అసహజం లేదేమో? అందులో మంగళ సూత్ర ధారణ, శోభనం కూడా అయిపోయాక! తెలిసినవాళ్ళు, కావలసిన వాళ్ళదగ్గిరే శేషగిరి మావగారు అలా ప్రవర్తించారు.

శేషగిరికి రాజేశ్వరి మీద కోపంగా వుంది.

* * *

నాలుగోరోజు పొద్దున్నే కాలింగుబెల్లు మోగగానే లేచి తలుపు తీసాడు శేషగిరి. గుమ్మంలో నిలబడ్డ రాజేశ్వరిని, పిల్లలని చూసి ఆశ్చర్యపోయాడు. "ఏమిటి అప్పుడే వచ్చేసేరు?" అనబోయాడు.

వారు లోపలకు వచ్చారు.

"మా అమ్మ రాసిన ఉత్తరం అందిందా? "ఏం రాసింది" అడిగింది. రాజేశ్వరి అయిదు నిముషాల తరువాత.

నేను చదవనని నీకు తెలుసుగా?" అన్నాడతను.

"కాని నేను లేనుగా"

"మీ అమ్మకు యీ విషయం తెలియదు కదా...అంతగా నాకు పనికి వచ్చే విషయం అయితే నా పేరనే రాసేదిగా...అందులో ఏ ముఖ్యవిషయము లున్నా నాకనవసరం. నువ్వెటూ వచ్చాక చెప్తావు కదా.. ఇంతకీ అప్పుడే వచ్చేసారేం?" అంటూ అడిగాడు శేషగిరి.

రాజేశ్వరి చెప్పేందుకు ఆలోచిస్తోంది. పెదవులు ఏదో చెప్పే ప్రయత్నం చేస్తుంటే నీళ్ళు నిండిన కళ్ళు అడ్డుపడుతున్నాయి. భర్త గ్రహించాడు.

"సరేలే...ఇదిగో ఉత్తరం....చదువు....తర్వాత చెబుదువుగాని" అంటూ ఉత్తరం అందించాడు.

రాజేశ్వరి ఉత్తరం చదివేసింది.

పిల్లలు నిద్రలేమివల్ల అప్పటికే మంచం ఎక్కేశారు.

"రాత్రి బస్సులో నిద్రలేదు. కాసేపు నిద్రపోతాను." అంది రాజేశ్వరి.


## తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

## దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

## తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టుకు డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AP)**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***


## భారతి
## కథలు రాసేవారికి మనవి.....

భారతిలో ప్రచురణకి పరిశీలనార్థం చిన్న కథలు పంపవలసిందిగా రచయిత(త్రు) లకి మనవి చేస్తున్నాము.

రచనలు కాగితానికి ఒకవైపే సిరాతో లేదా బాల్‌పెన్‌తో రాయాలి.

కథలు 12 అరఠావు కాగితాలకి మించకుండా ఉంటే మంచిది.

అనువాదాలు, అనుసరణలు పంపరాదు.

ప్రచురణకి స్వీకరించని రచనలని త్రిప్పి పంపడానికి తగినన్ని తపాలా బిళ్ళలు అతికించిన స్వంత చిరునామా గల కవరు జతపరచి పంపాలి.

రచనలని సంపాదకుడు, భారతి, సాహిత్య మాసపత్రిక, ఆంధ్రపత్రిక కార్యాలయం, గాంధీనగరం, విజయవాడ – 520003, అన్న చిరునామాకి పంపాలి.

"నిజానికి ఆగలేనిది నువ్వే. అందుకే నాలుగోరోజుకు పరుగెట్టుకుని వచ్చే సావ్. అలవాటు పడితే అంతే! అనవసరంగా దారి ఖర్చులయ్యాయి. మూడు రాత్రులు వృధా అయ్యేయి...ఇంతకీ ఉత్తరంలోని విశేషాలు ఏమిటి" అను నయంగా అడిగాడు శేషగిరి

"ఇప్పుడే చెప్పాల్సిన విశేషాలేమీలేవులెండి. మీరూహించినట్టుగానే జరిగింది' లేచాక చెప్తాలెండి. తలుపేసి రండి" అంది రాజేశ్వరి సిగ్గుపడుతూనే.

లేచేసరికి తొమ్మిది గంటలయింది. పిల్లలింకా లేవనేలేదు. "ఇంక లేవండి. ఆఫీసుకెళ్ళరూ" అంటూ రాజేశ్వరి భర్తను నిద్రలేపింది.

"మూడు రోజుల తరువాత శ్రీమతి వూరినుంచి తిరిగొస్తే ఏ మానవుడైన భర్తయినా ఆఫీసుకు ఎలా వెళ్ళగలడు? ఎన్నో వార్తలు, విశేషాలు, వింతలు వుంటాయి" గోముగా లేస్తూ అన్నాడు తను.

"దాని కోసమేనా మరి దేనికోసమేనా?" చిలిపిగా అడిగిందామె.

"దేవుడికి కొబ్బరికాయ కొడితే, ఆ దేవుడొచ్చి కొబ్బరికాయ తింటున్నాడు. దేవుడిది పేరు మాత్రమే."

రాజేశ్వరి కాఫీ ప్రయత్నంలో మునిగిపోయింది.

"ఏమిటలా చూస్తున్నారు?" కాఫీగ్లాసు అందిస్తూ అంది రాజేశ్వరి.

"ఏం లేదు...ఊరికెళ్ళి అందరినీ చూసొచ్చావు కదా, ఏమంత వర్షం చేసావో చూస్తున్నాను." భార్య కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు తను.

రాజేశ్వరి కళ్ళు చటుక్కున వర్షించాయి. తల్లి రాసిన ఉత్తరం తెచ్చి యిచ్చింది, శేషగిరి ఉత్తరం చదవసాగాడు.

"ఈ ఉత్తరం రాయకూడదనే అనుకున్నాను. కాని తప్పలేదు. బహుశా ఏ తల్లీ యిలా రాయదేమో? ఇంటి పరిస్థితులు ఏమీ బాగులేవు. ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా విశ్రాంతి లేకపోతోంది. మిమ్మల్ని సెలవులకు రావద్దని ఎలా రాయగలుగుతున్నానో నాకే తెలియటం లేదు.

మన పెంకుటిల్లుకి పెంకులు తిరగేస్తున్నారు. దాదాపు మూడు నాలుగువేల ఖర్చు. ఆమధ్య మీ నాన్నకు, తరువాత నాకు వంట్లో బాగోలేకపోవటం వల్ల మందులకు, డాక్టరుకు వెయ్యి ఖర్చు. మన నూతిలో నీళ్ళు అయిపోవటంతో, పూడిక తీయించి లోతు తీసేందుకు ఆరేడు వందల ఖర్చు. ఇక మీ నాయనమ్మ మంచం దిగటమే లేదు. మందులు, టానిక్కులు, గ్లూకోజు మీదే కాలక్షేపం చేస్తోంది. ఆ ఖర్చు సరేసరి. ఇప్పుడు అందరూ వస్తే ఎలా తృప్తిపరచాలో తెలియని అయోమయ పరిస్థితి ...పెంకుపని చేయించటంలో కరెంటు కనెక్షను తీయించివేసారు. రేపు మీ నాయనమ్మకు ఏదైనా అయితే అప్పుడు మీరంతా ఎటూ రాకతప్పదు. ఇప్పుడూ అప్పుడూ మీకే ఖర్చు. ఇలా రాస్తున్నానని ఏమీ అనుకోవద్దు. నీకు ఏది మంచిదని తోస్తే అలా చేయి. మీ ఖర్చులు, యిబ్బందులు తెలుసు కాబట్టి సిగ్గువిడిచి రాస్తున్నాను. మరోలా అనుకోవద్దు. (ఈ వాక్యాలు రాస్తున్నప్పుడు ఆవిడ ఎంత బాధపడుతూందో ఉత్తరంమీద పడ్డ కన్నీళ్ళు అలికేసిన అక్షరాలు తెలుపుతున్నాయి)

ఆరోగ్యం జాగ్రత్త, పిల్లలను ఎండల్లో ఎక్కడకూ తిరగనీయకు. రోజులు బాగోలేవు. పిల్లల్ని ఎత్తుకుపోతున్నారుట....కాలం పూర్తిగా చెడిపోయింది.

ఉంటాను...మీ అమ్మ.

ఉత్తరం చదివాక శేషగిరి కూడా విచారించాడు.

"మీచేత అప్పు చేయించి మరీ వెళ్ళాను" ఏడుస్తూ అంది రాజేశ్వరి,

"పోనీలే...మీ నాయనమ్మను చూసి వచ్చావు. అదే పదివేలు"

"ఏమండీ....నిజంగా అంటున్నారా లేక వెటకారంగా అంటున్నారా?" భర్త మాటలకు ఆశ్చర్యపోతూ అంది రాజేశ్వరి.

"నిజంగానే అంటున్నాను. ఈ విషయం ముందుగా నీకు చెప్తే బాధ పడతావని చెప్పలేదు. కాని నా మాటల్ని మరోవిధంగా అర్థం చేసుకున్నావు. ఏ భర్తా కూడా తన భార్యను ఏడిపించేందుకు ప్రయత్నించడు, ఆ విషయం నాకు తెలుసు!" అన్నాడు శేషగిరి.

రాజేశ్వరి కళ్ళు యింకా చెమరిస్తూనే వున్నాయి.

"ఊరుకో...ఏడవకు..." అంటూ రాజేశ్వరిని అక్కున చేర్చుకున్నాడు శేషగిరి. ※

# లిమిటెడ్ ఓవర్ల ఆట

## శ్రీ బండి రాధాక్రిష్ణ

అంధకారం ఒడిలో నింపుకుని
నిర్మానుష్యమైన నగరం ప్రక్కనుండి
నిశ్శబ్దంగా,
పారుతున్నది నది ఎక్కడికో
'శతాబ్దాలుగా చల్లారని లావాలా'
వేడెక్కిన ఇసక
కాళ్ళను కణకణలాడిస్తున్నది.
గాంధేయులు, అప్ఘన్‌లు
చైనీయులు, మస్కోవైట్‌లు ఎక్కడ?
భోపాల్, ఢిల్లీ, లండన్, మాస్కో
నగరం ఏదయితేనేం
నాగరకత నిదురపోయింతర్వాత
తూమిచుట్టూ సాటిలైట్లు
'ఆట ఆపేసిన
పిల్లవాడి బొమ్మల్లా'
అంతరిక్షంలో తిరుగాడుతున్నవి
హెర్షెల్ పెరిస్కోప్ లాపామా
పర్వతంనుండి శూన్యంలోకి చూస్తోంది!
గ్రహాంతరాళాల్లో ఏం జరుగుతుందో
చూసి చెప్పడానికి
లేరెవ్వరూ అక్కడ
చీకటిని మ్రింగివేసిన నదిలోంచి
ఏ మత్స్యమూ పుస్తకాలతో
పైకిరాదెందుకు?
దూరంగావెళ్ళిన నోవాపడవ
చేరే తీరంకోసం
ఎక్కడ వెదకాలి
శతాబ్దాల స్వార్థం,
'మహోన్నత వ్యక్తిత్వాల
గిరిశృంగ మానవప్రపంచం'
లిమిటెడ్ ఓవర్ల అణుయుద్ధంలో
గెలిచిన వాళ్ళను అడిగండి.